క్లుప్తంగా

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



దామెర : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు సూచించారు. హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారిలోని ఒగ్లాపూర్, ఊరుగొండ, పసరగొండ క్రాస్‌రోడ్డు, దామెర క్రాస్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వాహనాలు అతివేగంతో రావడం మూలంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై అశోక్, ఒగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నడికూడ : కంఠాత్మకూర్ పిడుగుగుట్ట వద్ద నిర్వహించనున్న మినీ జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు అన్నారు. శనివారం జాతర పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో మాట్లాడారు.

శాయంపేట : మేడారం జాతరకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రంజిత్‌రావు కోరారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులు విలువైన వస్తువులను ఇంటిలో ఉంచకూడదని అన్నారు. చోరీ జరిగే ప్రమాదం ఉన్నందున జాతరకు వెళ్లే ముందు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదమైన వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

సీబీఐతో విచారణ చేయించాలి



పరకాల : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీజేపీకి నష్టమేమీ లేదని అన్నారు. సత్యనారాయణరావు, డాక్టర్ కాళీప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

‘భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు’

ఐనవోలు : శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో దక్షిణ ద్వారం మూసివేసి భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు సామ్యూల్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లన్న జాతర ఉత్సవాలకు భక్తులు వేలాది మంది తరలి వస్తున్నారన్నారు. తూర్పు ద్వారం, పశ్చిమ ద్వారం ఇప్పటికే మూసి వేయగా భక్తులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. భక్తులు వస్తేనే ఆలయానికి ఆదాయం వస్తుందని, ఆలయ అధికారులు స్థానికులు అవడంతో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

మృతుల కుటుంబాలకు బియ్యం అందజేత



ఎల్కతుర్తి : మండలంలోని కోతులనడుమ గ్రామంలో ఎర్రోళ్ల సదానందం, దేవేందర్ తండ్రి మొండయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన బుచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి 50కిలోల బియ్యం అందించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు గొర్రె మహేందర్, ఎర్రోళ్ల జగన్, బాబురావు, రమేష్, రాజయ్య, మధు, కిషన్, యాకూబ్, రాకేష్ తదితరులు ఉన్నారు.

బోరుమోటార్ అందజేత

వేలేరు : మండలంలోని పీచర గ్రామంలో ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు నీటి సౌకర్యం కల్పించేందుకు గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుజ్జుల రాంగోపాల్ రెడ్డి బోరుమోటార్‌ను అందించారు. రూ.36,400 విలువ గల మోటార్‌తో పాటు పైపులు అందజేసినట్లు జాతర చైర్మన్ కొయ్యడ మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ కులగణన చారిత్రక నిర్ణయం

- కాంగ్రెస్ నాయకుల హర్షం
- సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఎల్కతుర్తి : సమగ్ర బీసీ కులగణన ఆమోదించడం చారిత్రక నిర్ణయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో కులగణన తీర్మానం బిల్లుకు ఆమోదం తెలిపిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, వివిధ శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూసిన కులగణనను అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించడం చారిత్రక నిర్ణయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు సుకినె సంతాజీ, నాయకులు గొడిశాల యాదగిరిగౌడ్, గోలి రాజేశ్వర్ రావు, బత్తిని రవీందర్‌గౌడ్, శనిగరం వెంకటేష్, హింగె శ్రీకాంత్, ముప్పు మహేందర్, తిరుపతి, రావుల రమేష్, మండ సుమన్‌గౌడ్, సాహు, కడారి సురేందర్, వినయ్, కార్తీక్, నవీన్ పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : బీసీ కుల గణన చేసేందుకు అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీర్మానించడం సంతోషకరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నాయకులు రవి, కుమారస్వామి, కుమారస్వామి, రమేష్, నాగేశ్వర్‌రావు, సతీష్, రాము, మార్కండేయ, వీరన్న, చంద్రమౌళి, తిరుపతి, శ్రీను పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..



ఎల్కతుర్తి : సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



శాయంపేట : పాలాభిషేకం చేస్తున్న నాయకులు



కమలాపూర్ : మాట్లాడుతున్న నాయకులు

కమలాపూర్ : బీసీ కుల గణనతో బీసీల జీవితాల్లో వెలుగులు రానున్నాయని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కొండ రమేష్, టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ తాటం రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన కులాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం శాసనసభలో బీసీ కుల గణన బిల్లును ప్రవేశపెట్టిందని, దానికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడం శుభపరిణామం అన్నారు. బీసీ కుల గణనతో జనాభా ప్రాతిపదికన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వెనుకబడిన వర్గాలకు ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. బీసీ కుల గణన బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలయ్య గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శులు భిక్షపతి, వంశీధర్‌రావు, నాయకులు ఆస్కార్ అశోక్, రమేష్, ఆకినపల్లి భిక్షపతి, పోతిరెడ్డి ఓదెలు, కిన్నెర కృష్ణమూర్తి, దేశిని వీరయ్య, ఆడెపు విజయ, రజిత పాల్గొన్నారు.

రామాలయంలో ఘనంగా ధ్వజారోహణం

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లోని కోదండ రామలయంలో ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, పుష్యక్షేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహనం, అంకురార్పణం నిర్వహించగా శనివారం రెండోరోజు ధ్వజారోహనం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అగ్నిప్రతిష్ట, చతుస్థానార్చన, పూర్ణహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు గుండవరం వనజ–భాస్కర్ రావు, సంస్థ ఏజీఎం పామేర సుమన్‌రావు, భక్తులు పాల్గొన్నారు. అలాగే 18న స్వామివారి కల్యాణ మహోత్సవంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది.



పూజలు నిర్వహిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు



కొలువైవున్న సీతారామ లక్ష్మణుడు

కాంగ్రెస్ పార్టీలో చేరిన పద్మశాలీలు

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెంకు చెందిన పలువురు పద్మశాలీలు శనివారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రణవ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో పొరండ్ల రమేష్, పొరండ్ల అశోక్, చిందం గౌరీశంకర్, రామచంద్రం, మురళి, పురుషోత్తం, జయశంకర్, సాంబయ్య, రాజేశం, కనుకయ్య, ప్రభాకర్, రాకేష్, సాంబయ్య ఉన్నారు. మండల అధ్యక్షుడు గుండవు చరణ్‌పటేల్, రిక్కల నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో కేసీఆర్ పాత్ర కీలకమని కొనియారు. ఈ సందర్భంగా పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



దామెర : జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు



కమలాపూర్ : కేక్‌కట్ చేస్తున్న సత్యనారాయణరావు



వేలేరు : కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



ఐనవోలు : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



శాయంపేట : కేక్‌కట్ చేస్తున్న నాయకులు



ఎల్కతుర్తి : బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



ఎల్కతుర్తి : ముల్కనూర్‌లో..



ఆత్మకూరు : కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంక్షిప్తంగా

పునఃప్రతిష్ఠాపన శుభసూచికం

దామెర : శివాలయ పునఃప్రతిష్ఠాపన గ్రామానికి శుభసూచికమని భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకుడు శేషు అన్నారు. మండల కేంద్రంలో శివాలయ నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. మూడు రోజులపాటు సంప్రదాయకంగా, శాస్త్రోక్తంగా పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామానికి చెందిన బార్ సోసియేషన్ రాష్ట్ర నాయకుడు ముద్దసాని సహోదర్‌రెడ్డి, పిల్లల వైద్య నిపుణుడు శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ పోలం కృపాకర్ రెడ్డి, శివం ట్రస్ట్‌చైర్మన్ బిల్లా రమణారెడ్డి, సభ్యులు గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోల్సాని అనిల్ రెడ్డి, చందుపట్ల సత్యవర్ధన్‌రెడ్డి, మేరుగు కుమార్, దామెరుప్పుల శంకర్, రాజు శర్మ, రాంరెడ్డి (బంగ్ల రామన్న) ఉన్నారు.

అధికారులు అవమానిస్తున్నారు

ఆత్మకూరు : అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర సమావేశాలు, పనులకు సబంధించిన సమాచారాన్ని ఇవ్వకుండా అధికారులు తనను అవమానిస్తున్నారని చౌళ్లపల్లి ఎంపీటీసీ బొమ్మగాని భాగ్యరవిగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి రివ్యూ మీటింగ్‌లో అధికారులను ఆదేశించినప్పటికీ అధికారులు పెడచెవిన పెడుతున్నారని మండిపడ్డారు. అభివృద్ధి పనుల గురించి నిలదీస్తాననే భయంతోనే అధికారులు స్థానిక ఎంపీటీసీ అయిన తనను కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని అన్నారు. విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు.

భ్రూణ హత్యలను నివారించాలి

దామెర : భ్రూణ హత్యల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని ఊరుగొండ అంగన్‌వాడీ కేంద్రంలో మహిసాధికారత సంస్థ ఆధ్వర్యంలో బేటీ–పడావో, బేటీ–బచావో కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలబాలిక మధ్య వ్యత్యాసాన్ని తగ్గించి ఇద్దరిని సమానంగా చూడాలన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించే విధంగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. ఆడపిల్లలు, మహిళలు హింసకు, వివక్షతకు గురైతే 1598, 181, 14567 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేసి రక్షణ పొందాలని అన్నారు. భ్రూణ హత్యలను నివారించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా సాధికార సంస్థ ప్రతినిధి లావణ్య, పంచాయతీ కార్యదర్శి వేణుమాధవ్, అంగన్‌వాడీ సిబ్బంది సుజాత, విజయ పాల్గొన్నారు.

ఉత్తమ వీఓఏకు అభినందనలు

ఐనవోలు : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతులమీదుగా ఉత్తమ వీఓఏగా ప్రశంసపత్రం తీసుకున్న పంతిని గ్రామానికి చెందిన కోదాటి మంజులను శనివారం వర్ధన్నపేట, ఐనవోలు మండలాల సెర్ప్, బ్యాంకు అధికారులు, వీఓ ప్రతినిధులు, స్వయం సహాయక బృందాల లీడర్లు వేర్వేరుగా పూలబొకె అందించి అభినందించారు. ఆమె మహిళలకు చేసిన మెరుగైన సేవలను గుర్తించి ఉత్తమ అవార్డు అందించడంతో పలువురు హర్షంవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బాల, ఐనవోలు, వర్ధన్నపేట ఏపీఎంలు రాజుకుమార్, వేణు, సెర్ప్, బ్యాంకు అధికారులు, సిబ్బంది, వీర్ల వేణు, అశోక్, మోహన్‌బాబు, గోలి కొమురయ్య, రమేష్‌బాబు, స్వామి, అనిల్, వీఓ ప్రతినిధులు, స్వయం సహాయక బృందాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను సంరక్షించాలి

ఐనవోలు : మండలంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను గుర్తించి, స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. మండలంలోని వెంకటపురం శివారులో సర్వే నంబర్ (324 బి, 324 సి, 324ఇ) భూములను పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి అసైన్‌మెంట్ చేసి ప్రభుత్వానికి ఇచ్చారని గుర్తుచేశారు. ఆ భూమిలో గతంలో సీపీఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారని అన్నారు. అప్పటి జిల్లా అధికారులు సైతం ఆ భూమిని పేదలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు కొంతమంది ఆక్రమించుకుని అక్రమ పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. అలాగే నందనం గ్రామశివారు వడ్డెగూడెంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మహేందర్, సంపత్, రామ్‌కుమార్, ఉప్పలయ్య, బాబురావు, ఆనంతం, కుమారస్వామి, నాగరాజు, మల్లయ్య, కొమురయ్య, యాకయ్య, పోచమ్మ, సృజన పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి

- డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మనోహర్

ఎల్కతుర్తి : ఈనెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాజ్యాంగ హక్కుల పైన దాడిని తీవ్రతరం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయకుండా నిధులను పక్కదారి పట్టిస్తుందని మండిపడ్డారు. నిత్యవసర వస్తువు ధరలతోపాటు కూరగాయలు, గ్యాస్ పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలను నియంత్రిచండంలో ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. కులాంతర వివాహం చేసుకున్న వారిపై దాడులు, బహిరంగ హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. వీటిని నియంత్రణ చేసందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం హేయమైన చర్యని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం గత తొమ్మిదిన్నర ఏళ్లుగా మితవాద నిరంకుశ మతతత్వ పాలన ఆచరణ కొనసాగిస్తుందని ధ్వజమెత్తారు. అంతే కాకుండా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ అటవీ హక్కుల చట్టాన్ని కాలరాస్తున్నారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వాన్ని బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా, నాయకులు కొమురయ్య, మాదారపు రాజయ్య, రవి, పరమేష్, సారయ్య, స్వరూప, శారద, పద్మ, ప్రియ, మౌనిక, భాగ్య, లత, కవిత, రాజయణి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మనోహర్

చదువుపై ఆసక్తి పెంపొందించాలి

ఐనవోలు : తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుపై ఆసక్తి పెంపొందించేలా వ్యవహరించాలని, బడి నుంచి ఇంటికి రాగానే చదువుకునే విధంగా చూడాలని ఐనవోలు, ఉడుతగూడెం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలతో పాటు ఉడుతగూడెం పాఠశాలలో తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇంట్లో పిల్లలు చదువుకునేందుకు సానుకూల వాతవరణం ఉండేలా చూడాలన్నారు. ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందించి విద్యార్థులు చురుకుగా ఉండే విధంగా చూడాలన్నారు. మంచి పనులను ప్రోత్సహిస్తూ వారిని ఉత్తేజపరిస్తే మరింత ఉత్సాహంగా చదువుకుంటారన్నారు. అనంతరం పుస్తక ప్రదర్శన, పిల్లలచే వ్యాస రచన, చిత్రలేఖనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, బీమళ్ల సారయ్య, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, ప్రతికంఠం ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు ప్రణీత, ఆయా రాధిక, తల్లిదండ్రులు చిదురాల మమత, బరిగెల రమేష్, రేణుక, రవి, దీప పాల్గొన్నారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

సాగునీరందించి పంటలను కాపాడాలి

కమలాపూర్ : పంటలకు సాగునీరు అందించి కాపాడాలని మండలంలోని శనిగరం, గూనిపర్తి, మాదన్నపేట, గోపాల్‌పూర్ గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌ను సింగాపూర్‌లోని ఆయన నివాసంలో శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. డీబీఎం 22ఏ, 22బీ కాల్వల ద్వారా తమ గ్రామాలకు సరిగా సాగునీరు అందడం లేదని, దీంతో తమ పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని అన్నారు. వారబంధీ కారణంగా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ప్రణవ్ వెంటనే ఎస్సారెస్పీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు సాగునీరు అందించి సమస్యను పరిష్కరిస్తామని ఎస్సారెస్పీ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు సంతోషించారు. ఈ సందర్భంగా ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్‌పటేల్, పలువురు రైతులు పాల్గొన్నారు.



ప్రణవ్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

ధర్మసాగర్ : మండలంలోని తాటికాయల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు చక్కగా బోధించారని అభినందించారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదానందం, విజయరాణి, హేమలత, రాధిక, సీఆర్పీ ఎర్ర రనూప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలిసిన నాయకులు

శాయంపేట : ఎంపీడీఓ ఫణిచంద్రను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.